
www.prajasakti.com

ప్రజాశక్తి

గురువారం 7 డిసెంబర్ 2023



ప్రభుత్వానికి పంట నష్టం నివేదికలు



వరి పంటను పరిశీలిస్తున్న ఎఒ కౌశిక

ప్రజాశక్తి-బి.కోడూరు : మండలంలో మిచౌంగ్ తుపాన్ వల్ల దెబ్బతిన్న పంటల వివరాలను ప్రభుత్వానికి నివేదికలు ఎఒ కౌశిక అన్నారు. బుధవారం ఆమె బి.కోడూరులో తుపాన్ వల్ల దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తుపాన్ వల్ల ఖరీఫ్, రబీ సీజన్‌లలో రైతులు సాగు చేసిన పంటలు దెబ్బతిన్నాయన్నారు. వరి, జొన్న, మినుము, మొక్కజొన్న పంటలను రైతులు నష్టపోయారని తెలిపారు. వాటి నష్టాన్ని ప్రాథమిక అంచనా వేస్తున్నామన్నారు.

అపార నష్టం

19 వేల ఎకరాల్లో దెబ్బతిన్న పంటలు

1,197 ఎకరాల్లో నేలకొరిగిన ఉద్యానం

వరి, బుడ్డశనగ, అరటిపై అధిక ప్రభావం



నేలకొరిగిన వరి పంట (ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

మిచౌంగ్ తుపాన్ అపార నష్టాల్ని మిగిల్చింది. జిల్లాలో 36 మండలాల్లోని వేలాది ఎకరాలకు తీవ్ర నష్టం వాటిల్లింది. అత్యధికంగా వరి, బుడ్డశనగ, అరటి పంటలపై ప్రభావాన్ని చూపిం చింది. జిల్లాలోని 13 మండలాల్లోని 12 రకాల పంటలు ప్రకృతి కన్నెర్రకు గురయ్యాయి. తీవ్ర తుపాన్ ధాటికి జిల్లాలో వ్యవసాయ, ఉద్యాన పంటలకు వాటిల్లిన నష్టాన్ని వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులు 33 శాతంపైగా నష్టపోయిన పంటలను ఎన్యూమరేషన్ చేయడంపై దృష్టి సారించారు. 33 శాతానికి కంటే తక్కువగా నష్టపోయిన పంటలను సైతం ఎన్యుమరేషన్ చేస్తే పూర్తిస్థాయిలో పంట నష్టాల్ని అంచనా వేసినట్లు అవుతుందని చెప్పవచ్చు.

జిల్లాలో 19,197 ఎకరాల్లో వ్యవసాయ, ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లింది. నాలుగు రోజుల కిందట పశ్చిమ మధ్య బంగాళా ఖాతంలో ఏర్పడిన మిచౌంగ్ తుపాన్ సోమ, మంగళవారాల్లో తీవ్ర ప్రభావాన్ని చూపించింది. ఈనేపథ్యంలో మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి జిల్లాలో 19,006 ఎకరాల్లో వ్యవసాయ పంటలు, 1,197 ఎకరాల్లో ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లింది. జిల్లాలోని 36 మండలాల పరిధిలోని కడప, చింతకొమ్మదిన్నె, ఒంటిమిట్ట, చెన్నూరు, ఖాజీపేట, వీరపునాయునిపల్లి, వల్లూరు, కమలాపురం, మైదు కూరు, దువ్వూరు, చాపాడు, బద్వేల్, అట్లూరు, సిద్ధవటం, కాశినాయన, పోరుమామిళ్ల, బి.కోడూరు, కలసపాడు, బి.మఠం మండలాల్లో ఖరీఫ్‌లో సాగు చేసిన 15,029 ఎకరాల్లోని 12 రకాల పంట లైన వరి, బుడ్డశనగ, అరటి, వేరుశనగ, మినుములు, జొన్న, మొక్క జొన్న, మిరప, టొబాకో పంటలు దెబ్బతిన్నాయి. ఇందులో అత్య ధికంగా 13,234 ఎకరాల్లో ఎకరాల్లో వరి, 432 ఎకరాల్లో బుడ్డ శనగ నీట మునిగింది. రబీ సీజన్‌లో ఒంటిమిట్ట, చెన్నూరు, ఖాజీపేట, మైదుకూరు, దువ్వూరు, చాపాడు, బద్వేల్, గోపవరం, అట్లూరు, సిద్ధవటం, పోరుమామిళ్ల, బి.కోడూరు, కలసపాడు సాగు చేసిన విస్తీర్ణంలోని 4,611 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లింది. అత్యధికంగా 1,961 ఎకరాల్లో బుడ్డశనగ, 1,795 ఎకరాల్లో వరి, మినుములు, వేరుశనగ, జొన్న, మొక్కజొన్న, మస్క్ మె లన్ పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది.

నేలకొరిగిన ఉద్యానం

ఉద్యాన పంటలకు సంబంధించి 1,197 ఎకరాల్లో నష్టం వాటిల్లింది. అత్యధికంగా అరటి, బొప్పాయి, పంటలకు నష్టం వాటిల్లింది. జిల్లాల్లోని ఒంటిమిట్ట, కడప, వల్లూరు, చింతకొమ్మదిన్నె, మైదుకూరు, చెన్నూరు, సిద్ధవటం, కాశినాయన, బి.మఠం, బద్వేల్, ఖాజీపేట, అట్లూరు మండలాల పరిధిలో 1,101 ఎకరాల్లో ఉద్యాన పంటలకు పంట నష్టం వాటిల్లిన సంగతి తెలిసిందే. బుధవారం నాటి ఎన్యూమరేషన్ నాటికి 1,101 ఎకరాలకు అదనంగా మరో 97 ఎకరాలకు నష్టం అంచనా చేరుకుంది. ఇందులో 899 ఎక రాలకు పైగా అరటి పంట నేల కొరిగింది. దీంతోపాటు బొప్పాయి, నిమ్మ, వంగ, మిరప, టమోటా, కర్బూజ, ఉల్లి తదితర పంటలు పో వడం తెలిసిందే. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రకృతి వైపరీత్యాల బారిన పడిన పంట నష్టాలను 33 శాతంపైగా నష్టాలను అంచనా వేయడం తెలిసిందే. 33 శాతం లోపు దెబ్బతిన్న పంటలను గాలికి వదిలేయడం విస్మయాన్ని కలిగిస్తోంది. రైతుప్రభుత్వమని ప్రచార హోరు సాగిస్తున్న నాయకగణం మిచౌంగ్ తుఫాన్ బారిన పడిన రైతులందరికీ పరిహారం అందించే ప్రయత్నం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పవచ్చు.

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

- **తక్షణ సహాయక చర్యలు చేపట్టకపోతే ఆందోళన చేస్తాం**
- **అరటి, తమలపాకు తోటలను పరిశీలించిన ఎఐకెఎస్ నాయకులు**



నేలకొరిగిన తమలపాకు తోటలను పరిశీలిస్తున్న ఎపి రైతు సంఘం నాయకులు

ప్రజాశక్తి-చింతకొమ్మదిన్నె

మిచౌంగ్ తుపాన్ బీభత్సం వల్ల పంటలు నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని ఎపి రైతు సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు జి.చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శి బి.దస్తగిరిరెడ్డి డిమాండ్ చేశారు. బుధవారంనాడు మిచౌంగ్ తుపాన్ వల్ల నేలమట్టమైన అరటి, ఆకుతోటలను వారు. పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తక్షణ సహాయక చర్యలు చేపట్టాలని కోరారు. లేకపోతే ఆందోళనలు చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి తుపాను వల్ల పెనుప్రమాదం పొంచి ఉంని జిల్లా కలెక్టర్లు అప్రమత్తంగా ఉండి ముందస్తు సహాయక చర్యలకు సిద్ధం కావాలని ముందస్తు మీటింగులు పెడుతున్నారు తప్ప, ఆచరణలో సహాయక చర్యలు చేపట్టడం లేదని విమర్శించారు. రెండు రోజులు ఎడతెరిపిలేని వర్షాల వల్ల రోజువారి కూలీ చేసుకునే పేదలకు పూట గడవడమే కష్టంగా ఉందని తెలిపారు. అలాంటి వారికి భోజనం ఏర్పాటు చేయాల్సిన బాధ్యతను అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లాలో ఆరా కొరగా సాగు చేసిన చేతికొచ్చిన వరి, అరటి, తమలపాకు, బొప్పాయి పంటలు పూర్తిగా చేలోనే నేలకొరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో అక్కడక్కడ సాగుచేసిన మినుము, సెనగ, ఉద్యాన పంటలు నేలబట్టమయ్యాయన్నారు. పత్తి పంట, పూల తోటలు పాడైపోయాయని తెలిపారు. రైతు భరోసా కేంద్రాలలో రైతులకు అవసరమైన వ్యవసాయ యంత్రాలు అందుబాటులో ఉంటాయని చెబుతున్నప్పటికీ ఆచరణలో ఎక్కడ అందుబాటులో లేవని పేర్కొన్నారు. వరి కోత మిషన్లు యంత్రాలన్నీ వైసిపి నేతల ఇళ్లలో ఉన్నాయని విమర్శించారు. యంత్రాలు అందుబాటులో ఉంటే సగానికి పైగా పంట నూర్పిడి సకాలంలో చేసుకునే వారన్నారు. కనీసం ధాన్యం కప్పుకోవడానికి పట్టలు సరఫరా కూడా ప్రభుత్వం నిలిపేసిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. తక్షణం ప్రభుత్వం దెబ్బతిన్న పంటల వివరాలను నమోదు చేసి పంటల బీమా పెట్టుబడి రాయితీ పరిహారాన్ని స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం చెల్లించాలని డిమాండ్ చేశారు. తక్షణం తుపాన్ సహాయక చర్యలు చేపట్టాలని తెలిపారు. కార్యక్రమంలో ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు గోపాలకృష్ణయ్య, మండల రైతు సంఘం అధ్యక్షులు శ్రీనివాసులురెడ్డి, రైతు నాయకులు శ్యాంసుందర్‌రెడ్డి, బాధిత రైతులు పాల్గొన్నారు. **చాపాడు :** మైదుకూరు మండలంలో మిచౌంగ్ తుపాన్ వల్ల నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోకపోతే ఆందోళన తప్పదని సిపిఎం నాయకులు గండి సునీల్ కుమార్, గుర్రయ్య హెచ్చరించారు. మండలంలోని లింగాలదిన్నెలో నేలమట్టమైన వరి, మొక్కజొన్న పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో రవి, శేఖర్, సుధాకర్, పోలయ్య, బాబు, గురయ్య పాల్గొన్నారు.

రాష్ట్రంలో పోలీసు రాజ్యం నడుస్తోంది : పిసిసి

ప్రజాశక్తి - వేంపల్లె

రాష్ట్రంలోని పోలీసు రాజ్యం నడుస్తున్నదని పిసిసి మీడియా చైర్మన్ డాక్టర్ ఎన్.తులసిరెడ్డి అన్నారు. బుధవారం వేంపల్లెలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జాతీయ నేర గణాంక సంస్థ నివేదిక ప్రకారం 2022లో పోలీసుల ఆకృత్యాల్లో ఆంధ్రప్రదేశ్ దేశంలో 3 స్థానంలో ఉండగా దక్షిణాది రాష్ట్రాలలో 1వ స్థానంలో ఉందన్నారు. దేశంలో మహారాష్ట్ర 375 పోలీసుల ఆకృత్యాలతో 1 స్థానంలో, రాజస్థాన్ 227 ఆకృత్యాలతో 2వ స్థానంలో ఉండగా, 221 ఆకృత్యాలతో ఆంధ్రప్రదేశ్ 3వ స్థానంలో ఉందని తెలిపారు. దక్షిణాది రాష్ట్రాలకు సంబంధించి తమిళనాడులో 114, తెలంగాణలో 88, కేరళలో 101, కర్ణాటకలో 60 పోలీసుల ఆకృత్యాలు జరగగా ఆంధ్రప్రదేశ్‌లో 2021 జరగడం గమనార్హమన్నారు. తెలంగాణలో 6 గ్యారంటీలు కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తెచ్చినట్లే ఆంధ్రప్రదేశ్‌లో 6 సూత్రాలు కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తెస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. వ్యవసాయ రుణాలు మాఫీ, రూ.500లకే వంట గ్యాస్ సిలిండర్ సరఫరా, ప్రతి నిరుపేద కుటుంబానికి నెలకు రూ.6 వేలు ఆర్థిక సహాయం, ప్రత్యేక హోదా అమలు, రాయలసీమకు, ఉత్తరాంధ్రకు ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజి అమలు, కడప జిల్లాలో స్టీల్ ప్లాంట్, పోలవరం ప్రాజెక్టు పూర్తి, విభజన చట్టంలో పేర్కొన్న అన్ని అంశాలను అమలు చేస్తామని పేర్కొన్నారు. కాంగ్రెస్ 6 సూత్రాలు ఆంధ్రప్రదేశ్‌లో అధికారానికి సోపానాలని చెప్పారు.

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలి

- గాంధీ, అంబేద్కర్ విగ్రహాలకు వినతులు



మైదుకూరులో అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ప్రజాశక్తి-చాపాడు

సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంగన్వాడీలు బుధవారం మహాత్మా గాంధీ, అంబేద్కర్ విగ్రహాలకు వినతిపత్రాలు సమర్పించారు. మైదుకూరులో కడప రోడ్డులోని అంబేద్కర్ విగ్రహం వద్ద అంగన్వాడీల సమస్యలపై నిరసన తెలిపి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు ధనలక్ష్మీ మాట్లాడుతూ అంగన్వాడీలకు వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ నెల 8న సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటి అమలు చేయాలని కోరుతూ నిర్వహించే నిరవధిక సమ్మెను జయప్రదం చేయాలన్నారు. అంగన్వాడీలకు తెలంగాణ కన్నా అదనంగా వేతనాలు పెంచుతానన్న ముఖ్యమంత్రి హామీ నీటి మీద రాతలుగా మిగిలిందన్నారు. అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు, మినీ వర్కర్ను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. 2022లో సుప్రీం కోర్టు అంగన్వాడీలకు గ్రాట్యూటి అమలు చేయాలని ఇచ్చిన తీర్పు నేటికి రాష్ట్రంలో అమలు కాలేదన్నారు. మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చలేదన్నారు. హెల్పర్ల ప్రమోషన్లకు ఎటువంటి నిబంధన రూపొందించలేదన్నారు. సెంటర్ల నిర్వహణకు అంగన్వాడీలే పెట్టుబడులు పెట్టాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు భారతి, రామతులశమ్మ, చెన్నమ్మ, కార్యకర్తలు పాల్గొన్నారు. **ప్రొద్దుటూరు :** అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని సిపిఎం పట్టణ కార్యదర్శి సత్యనారాయణ, అంగన్వాడీ యూనియన్ కార్యదర్శి సుబ్బలక్ష్మి కోరారు. స్థానిక పాత బస్టాండ్‌లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు గీత సువార్తమ్మ నాగవేణి సుబ్బలక్ష్మ నాగేశ్వరి పాల్గొన్నారు.



సంక్షేమ బోర్డును ఆవిష్కరిస్తున్న అంజాద్‌బాషా

అభివృద్ధి, సంక్షేమంలో దేశానికే ఆదర్శం

- ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా

ప్రజాశక్తి - కడప

అభివృద్ధి, సంక్షేమంలో ఆంధ్రప్రదేశ్ దేశానికే ఆదర్శమని ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా అన్నారు. బుదవారం స్థానిక ఎన్‌జిఒ కాలనీ 9వ డివిజన్ సచివాలయం-1 పరిధిలో కార్పొరేటర్ గంగాదేవి, ఇన్‌ఛార్జి కిరణ్ ఆధ్వర్యంలో జగనన్నే ఎందుకు కావాలంటే అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేనివిధంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి పేద ప్రజలకు అందించారని తెలిపారు. జగన్ మళ్లీ ముఖ్యమంత్రిగా ఉంటే మరిన్ని ఎన్నో పథకాలను ప్రవేశపెట్టి అందిస్తారన్నారు. అనంతరం మా నమ్మకం నువ్వే జగనన్న సంక్షేమ పథకాల ఫ్లెక్సీని ఆవిష్కరించారు. కార్యక్రమంలో 10వ డివిజన్ కార్పొరేటర్ మల్లికార్జున, నాయకులు నరపురెడ్డి సుబ్బారెడ్డి, తోటకృష్ణ, శ్రీనివాసులురెడ్డి, వెంకట సుబ్బయ్య, ప్రభు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చదరంగం పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-కడప అర్బన్

జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఓపెన్ చెస్ టోర్నమెంట్ పోటీలలో నగరంలోని జయనగర్ కాలనీ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులు చక్కటి ప్రతిభ చూపి ప్రథమ స్థానంలో నిలిచారని క్రీడాకారులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు భాగ్యవతి అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థులు లక్ష్మి, ఎనిమిదవ తరగతి విద్యార్థి జోషిక మొదటి స్థానం నుంచి బంగారు పతకాలు సాధించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు వెంకటసుబ్బమ్మ, ఉమామహేశ్వరి పాల్గొన్నారు.

మసకబారుతున్న టిటిడి ప్రతిష్ట

ప్రజాశక్తి-కడప అర్బన్

ప్రపంచంలో అత్యంత పవిత్రమైన హిందూ ధార్మిక సంస్థ టిటిడి ప్రతిష్ట మసకబారేలా టిటిడి వ్యవహరిస్తోందని, అన్నదాన సేవ పవిత్రతను మంటగలుపుతున్నారని టిడిపి మాజీ బ్రాహ్మణ కార్పొరేషన్ జిల్లా కో-ఆర్డినేటర్ జనార్ధన్ అన్నారు. బుధవారం టిడిపి జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ భక్తులకు అన్నదానం నాశిరకంగా, నాణ్యతా లోపంతో చేయడం దారుణమని పేర్కొన్నారు. అన్నదానం నాణ్యత లోపించిందని భక్తులు ఆరోపిస్తే లోపాలను సరిదిద్దుకుంటామని చెప్పకుండా తిరిగి భక్తులను టిటిడి చైర్మన్ విమర్శించడం తగదన్నారు. మాజీ ముఖ్యమంత్రి ఎన్.టి.రామారావు ఎంతో ఉన్నతాశయంతో తిరుమలకు వచ్చే భక్తుల కోసం అన్నదాన సేవను ప్రారంభించారని తెలిపారు. వైసిపి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి టిటిడిని రాజకీయ పునరావాసంగా మార్చారని విమర్శించారు. తిరుమలలో వసతి గదుల ధరలు, శ్రీవారి సేవల ధరలు విపరీతంగా పెంచి సామాన్య భక్తులకు స్వామి వారిని దూరం చేసే చర్య, టిటిడి ప్రతిష్ట మంటగలిసే నిర్ణయాలు కాకుండా పవిత్రతను కాపాడేలా పాలకవర్గం దృష్టి సారించాలని హితవు పలికారు.

సమస్యలు పరిష్కరించాలని డిఇఒకు ఎస్‌టియు వినతి

ప్రజాశక్తి-కడప అర్బన్

ఉపాధ్యాయులకు, పాఠశాలలకు సంబంధించిన పలు సమస్యలను పరిష్కరించాలని ఎస్‌టియు రాష్ట్ర అధ్యక్షులు ఎల్.సాయి శ్రీనివాస్, రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఉపాధ్యాయులకు సంబంధించిన వివిధ సమస్యలపై జిల్లా విద్యాశాఖాధికారి వై.రాఘవరెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షలలో మంచి ఫలితాలు సాధించాలనే ఉద్దేశ్యంతో విడుదల చేసిన ప్రత్యేక కార్యాచరణను స్వాగతిస్తున్నామని తెలిపారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఆదివారం రోజున ఉన్న కార్యాచరణను రద్దు చేయాలన్నారు. పాఠశాల నిధులు మంజూరు చేయని కారణంగా వేలకు వేలు వస్తున్న విద్యుత్ బిల్లులు కట్టలేక ప్రధానోపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.రమణారెడ్డి, వై.వెంకట సుబ్బయ్య, నాయకులు బాలగంగిరెడ్డి, ఇలియాస్ బాష, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వరి ధాన్యం పరిశీలన

ప్రజాశక్తి-పోరుమామిళ్ళ

మండలంలోని సంచర్ల పంచాయతీలో అకాల వర్షానికి తడిసిన వరి ధాన్యాన్ని ఎఒ వరహరి కుమార్ పరిశీలించారు. రైతులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పడిపోయిన వరి నిలబెట్టి కట్టలుగా కట్టాలన్నారు. వరి పంట పడిపోయినప్పుడు ధాన్యం మొలకెత్తకుండా ఎకరానికి 25 కిలోల వంతున ఉప్పు ద్రావణాన్ని పిచికారీ చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో విఎఎ హర్ష పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ఆహ్వానం

ప్రజాశక్తి-కడప అర్బన్

వైఎస్ఆర్ జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 23, 24వ తేదీన కడప జిల్లా పరిషత్ సభాభవనంలో మహాసభలు నిర్వహిస్తున్నామని, ఈ సభలకు జిల్లాలో ఉన్న తెలుగు ఉపాధ్యాయులందరికీ ఆహ్వానం పలుకుతున్నామని జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా భాష, చరిత్ర, సంస్కృతి, కళలు తదితర అంశాలపై ప్రసిద్ధులైనవారు ప్రసంగాలు చేస్తారని పేర్కొన్నారు. ఈ ప్రసంగాలవల్ల తెలుగు ఉపాధ్యాయులకు జిల్లాపై సమగ్రమ్మైన అవగాహన కలుగుతుందని, ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. వీల్కైతే జిల్లా విద్యాశాఖ అధికారితో మాట్లాడి 23వ తేది శనివారం ఓడి ఇప్పించే ప్రయత్నం చేస్తామని పేర్కొన్నారు.

మనోభావాలు దెబ్బతినకుండా సర్కిళ్లు నిర్మించాలి



మాట్లాడుతున్న సలావుద్దీన్

ప్రజాశక్తి-కడప అర్బన్

కడప నగరంలో అభివ ృద్ధి పనులలో భాగంగా ఉన్న కూడళ్లను తొలగించి కొత్త కూడళ్ళ నిర్మించడం మంచి పనే అని లౌకిక వాదులైన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు నజీర్ అహ్మద్, సంఘ సేవకులు సయ్యద్ సలావుద్దీన్, సిపిఐ నగర కార్యదర్శి వెంకట శివ అన్నారు.అయితే ఏడు రోడ్ల కూడలిలో గండికోట గుర్తుగా నిర్మాణాలు చేపట్టారు. అందరు సంతోషించారు. అయితే ఇది గిట్టని బిజెపి, ఆరెస్సెస్,భజరంగ్ దళ్ చెందిన కొందరు కార్పొరేషన్ అధికారులను కలిసి ఏమని చెప్పారో ఏమో మరుక్షణం నిర్మాణాన్ని అధికారులు తొలగించడం భావ్యమా అని ప్రశ్నించారు. బుధవారం ఆర్డీఓ ను కలిసి విషయం తెలిపారు. అనంతరం వారు విలేఖరులతో మాట్లాడుతు నగరంలో హిందు ధర్మానికి చెందిన అన్నమయ్య విగ్రహం,క ృష? సర్కిల్ వద్ద దేవునికడప ఆర్చి వాటిని ఏనాడూ ముస్లింలు అభ్యంతరం తెలపలేదన్నారు.అసలు ఉనికిలేని బిజెపి, దాని అనుబంధ సంస్థల నాయకులు చెప్పిన వెంటనే కోట కట్టడాలను తొలగించడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. ఆర్‌డిఒ సానుకూలంగా స్పందించి మళ్ళీ ఒక అన్నివర్గాలతో ఏర్పాటు చేసి అందరికి న్యాయం జరిగేలా చూస్తామన్నారు.

రోజుకో నిరుద్యోగి ఆత్మహత్య

- టిడిపి బిసి సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి భరత్‌కుమార్

ప్రజాశక్తి-కడప అర్బన్

రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగాల కోసం నాలుగున్నర సంవత్సరాల పాటు ఎదురుచూసి ఒకవైపు వయస్సు పెరిగి, మరోవైపు కోచింగులు తీసుకోవడానికి డబ్బులు లేక, ఆర్థిక స్థితిగతులు సరిగా లేక యువత నిరాశలో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని టిడిపి బిసి సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి భరత్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం టిడిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పాదయాత్ర సందర్భంగా ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని, రెగ్యులర్ డిఎస్సీ నిర్వహిస్తామని, గ్రూప్-1, గ్రూప్-2 పోస్టు విడుదల చేస్తామని చెప్పి ఇంత వరకు వాటి ఊసే ఎత్తలేదని పేర్కొన్నారు. టిడిపి ప్రభుత్వ హయాంలో యువతకు ఉచిత కోచింగ్ ఇవ్వడం కోసం బిసి స్టడీ సర్కిల్స్ ఏర్పాటు చేశారని, వీటి ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా వేలాది మంది యువత ఉచిత కోచింగ్ తీసుకుని మంచి ఉద్యోగాలలో స్థిరపడ్డారని తెలిపారు. రాష్ట్రంలో అధిక జనాభా కలిగిన బిసి సామాజిక వర్గం ఆర్థిక స్థితిగతులు దారుణంగా ఉన్నాయని చెప్పారు. అలాంటి నేపథ్యంలో వేల రూపాయలు వెచ్చించి కోచింగ్‌లు తీసుకోలేక ఆత్మహత్యలు చేసుకుంటున్నా యువత అధికంగా బడుగు, బలహీన సామాజిక వర్గాల్లోనే ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నాలుగున్నర సంవత్సరాల కాలంలో రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 1,345 మంది నిరుద్యోగులు బలవన్మరణాలకు పాల్పడ్డారంటే ఈ ప్రభుత్వం నిరుద్యోగుల పట్ల ప్రదర్శన ప్రదర్శిస్తున్న తీరుకు నిదర్శనమని తెలిపారు. మరోవైపున స్వయం ఉపాధి కోసం గతంలో ఇచ్చేటువంటి బిసి సబ్సిడీ రుణాలను పూర్తిగా రద్దుచేసి అటు స్వయం ఉపాధి, ప్రభుత్వ ఉద్యోగాలు లేక యువతను రోడ్డుకీడ్చిన ఘనత వైసిపి ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. సమావేశంలో టిడిపి బిసి సెల్ అధికార ప్రతినిధి సుబ్రహ్మణ్యం, ఆర్గనైజింగ్ సెక్రటరీ రెడ్డయ్య యాదవ్, జిల్లా నాయకులు మణికంఠ పాల్గొన్నారు.

పోలీసు సిబ్బందిని అభినందించిన ఎస్‌పి

ప్రజాశక్తి-కడప అర్బన్

పోలీస్ సిబ్బందిని ప్రోత్సహించే క్రమంలో ఎస్పి సిద్దార్థ్ కౌశల్ అత్యుత్తమ పనితీరు కనబరచిన వారికి ఉత్తమ సేవా అవార్డును అందచేస్తున్నారు. బుధవారం ముగ్గురు సివిల్, ఎఆర్ సిబ్బందిని ఎంపిక చేసి నగదు రివార్డు, ప్రశంసా పత్రం అందచేసి ప్రత్యేకంగా అభినందించారు. బద్వేలు పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి రూ.3 లక్షల నగదు స్కూటర్ డిక్కీలో తీసుకెళుతుండగా గుర్తు తెలియని వ్యక్తులు నగదును దొంగిలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దొంగల కోసం విస్తృతంగా గాలించారు. బృందంలోని అట్లూరు ఎఎస్ఐ పి.రాంభూపాల్‌రెడ్డి, బద్వేలు పిఎస్ కానిస్టేబుల్ ఎల్.అమరేశ్వర్ రెడ్డి (పి.సి 2519) ఇద్దరు నిందితులను అరెస్టు చేసి వారి నుంచి నగదును స్వాధీనం చేసుకున్నారు. వారిని ప్రత్యేకంగా అభినందించి ప్రశంసా పత్రం, నగదు రివార్డు అందచేశారు. సమర్థవంతంగా విధులు నిర్వహిస్తున్న ఐటి కోర్ టీం ఎఎస్ఐ షేక్ అక్బర్ అలీ ప్రత్యేకంగా అభినందించారు. జిల్లాకు చెందిన జెకెసి ఫిర్యాదులు, సిఎంఒ ఫిర్యాదులు తదితర విధులను సకాలంలో ఆయా పోలీస్ అధికారులకు చేరవేయడంలో కీలక పాత్ర నిర్వహించడం అభినందనీయమన్నారు. బాంబు డిస్పోజల్ టీంలో ఎఆర్ ఎస్ఐగా విధులు నిర్వర్తిస్తున్న జి.ఎల్.ఆర్.సభాపతిని ప్రత్యేకంగా అభినందించారు. ఉన్నతాధికారుల ఆదేశాలను పాటిస్తూ వారు అప్పగించిన విధులను సమర్థవంతంగా నిర్వహించడం అభినందనీయమన్నారు.

ఆకట్టుకున్న కవితా మహోత్సవం

ప్రజాశక్తి- పోరుమామిళ్ల

రాయలచెరువు గట్టుపై వెలసిన భైరవేశ్వర స్వామి సన్నిధిలో రమ్యమైన కవన, కవితా మహోత్సవం వీనుల విందుగా రాయల సేవా సమితి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వైష్ణవి పాఠశాల కరస్పాండెంట్ ఆర్.వి రామకృష్ణ అధ్యక్షతన కవితా మహోత్సవంలో మొల్ల సాహితీ పీఠం అధ్యక్షులు గానుగపెంట హనుమంతరావు, పుట్టపర్తి సాహితీ పీఠం అధ్యక్షులు జింక సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో నవరత్న కవి పండితులు పాల్గొన్నారు. గొంటుముక్కల గోవింద్, కుందారపు గురుమూర్తి, నూనె శ్రీనివాసులు, రామకృష్ణయ్య, సుబ్బారెడ్డి, చెన్నారెడ్డి, నాగసుబ్బయ్య, బొల్లు రామ్మోహన్, తుపాకుల శ్రీనివాసులు కవితా గానం చేశారు. కార్యక్రమానికి అతిథులుగా మేజర్ పంచాయతీ సర్పంచ్ యనమల సుధాకర్, అప్కోస్ డైరెక్టర్ కళ్యాణ చక్రవర్తి వావిళ్ళ ప్రభంజన్ కుమార్ పాల్గొన్నారు. కార్యక్రమంలో చెరువుకట్ట ప్రాముఖ్యతను రాయలవారి ప్రచారంజక పరిపాలన ప్రాముఖ్యతను తెలుసుకొన్నారు. కవులందరినీ రాయల సేవా సమితి అధ్యక్షులు రుద్రవరం వెంకటేశ్వర్లు బాలచంద్ర వెంకటసుబ్బయ్య తదితరులు ఘనంగా సన్మానించారు.

వైసిపి పాలనలో అభివృద్ధి శూన్యం

- టిడిపి కడప నియోజకవర్గ ఇన్‌ఛార్జి మాధవి



కరపత్రాలు పంపిణీ చేస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి-కడప అర్బన్

వైసిపి పాలనలో అభివృద్ధి శూన్యమని టిడిపి కడప నియోజకవర్గ ఇన్‌చార్జి మాధవిరెడ్డి అన్నారు. బుధవారం నగరంలోని 19వ డివిజన్ యర్రముక్కపల్లిలో టిడిపి, జనసేన పార్టీల ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి ప్రజల సమస్యలు తెలుసుకుని, బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ అనే పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సిఎం జగన్ మోహన్‌రెడ్డి నాలుగున్నర సంవత్సర పరిపాలన కాలంలో అభివృద్ధి శూన్యమన్నారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి చెందాలంటే చంద్రబాబునాయుడుతోనే సాధ్యమన్నారు. టిడిపి, జనసేన నాయకులపైన అక్రమ కేసులు బనాయిస్తున్నారని విమర్శించారు. టిడిపి జనసేన నాయకుల పైన దాడులు చేస్తే సహించమని హెచ్చరించారు. అధికార అహంతో ప్రవర్తిస్తున్నారని పేర్కొన్నారు. టిడిపి నాయకుల ఆత్మస్థైర్యాన్ని భయభ్రాంతులకు గురి చేసేలా కొందరు అధికారులు వ్యవహరిస్తున్నారని చెప్పారు. జనసేన, టిడిపి పొత్తుతో రాష్ట్రంలో విజయ డంకా మోగిస్తామని తెలిపారు. కడప నగరంలో ఎక్కడ అభివృద్ధి లేదని విమర్శించారు. చిన్నపాటి వర్షానికి నగరం మొత్తం జలమయమవుతుందని పేర్కొన్నారు. నగరం మొత్తం ఎక్కడ చూసినా మోకాళ్ళ లోతు వర్షం నీరు కనిపిస్తున్నాయని విమర్శించారు. వర్షం నీరుతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. మిచౌంగ్ తుపాన్ ప్రభావంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారని చెప్పారు. కనీసం అంజాద్ బాషా ప్రజల స్థితిగతులు కూడా తెలుసుకోలేదని విమర్శించారు. ప్రజల సమస్యలను తెలుసుకుని సంబంధిత అధికారులతో చర్చించాల్సిన బాధ్యత కడప ఎమ్మెల్యే అంజద్‌బాషాదేనన్నారు. నగరంలో భారీ వర్షాలు కురిస్తే, కనీసం నగరంలో ఎక్కడ కూడా అంజాద్‌బాషా ఫొటో కనిపించలేదని పేర్కొన్నారు. నగరంలో ఎలాంటి పరిస్థితుల్లో ఉందో అంజాద్‌బాషా అనుచరులకు తెలియదా అని ప్రశ్నించారు. అంజాద్‌బాషా డిప్యూటీ సిఎం పదవి భూఆక్రమణలకు చేయడానికి వాడుకున్నాడు తప్ప, ప్రజలకు సేవ చేయడానికి వాడుకున్నాడా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి, నాయకులు గోవర్ధన్‌రెడ్డి, జనార్ధన్‌రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

వైసిపి పాలనలో అధికమైన అరాచకాలు : 'వరద'

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

వైసిపి పాలనలో నియోజకవర్గంలో అరాచకాలు ఎక్కువయ్యాయని, అందుకనే తాను మళ్లీ రాజకీయాల్లోకి వచ్చానని మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి తెలిపారు. స్థానిక తన కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ టిడిపి టికెట్ తనకే వస్తుందని తాను ఏనాడు చెప్పలేదన్నారు. నిజాన్ని ఒప్పుకునే ధైర్యం వైసిపి నాయకులకు లేదన్నారు. గత ప్రభుత్వ హయాంలో తాము పేదలకు రెండు సెంట్లు స్థలంలో ఇంటి నిర్మాణం చేపట్టామన్నారు. నేడు వైసిపి ప్రభుత్వంలో ఒక సెంటు స్థలానికే పరిమితం చేసి పేదల కడుపు కొట్టారన్నారు. తమ ప్రభుత్వ హయాంలో నియోజకవర్గ పరిధిలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న రోజుల్లో ప్రొద్దుటూరు శాంతియుతంగా ఉండేదన్నారు. 2024 ఎన్నికల్లో ప్రజలు తనని ఎమ్మెల్యేగా ఎన్నుకోవడం ఖాయమని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ ఆసం రఘురామిరెడ్డి పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

ప్రజాశక్తి - ఖాజీపేట

తుఫాను కారణంగా పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని, ఆ రైతులను ఆదుకోవాలని టిడిపి మండల సీనియర్ నాయకులు, కడప మార్కెట్ యార్డ్ మాజీ డైరెక్టర్ సందుల నాగశివారెడ్డి బుధవారం కోరారు. పత్తి, మినుము, వరి, ఉద్యాన తోటలు, జొన్న పంటలు పూర్తిగా నీట మునిగిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదన్నారు. ప్రభుత్వం స్పందించి రైతులను అన్ని విధాలా ఆదుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.



సందుల నాగశివారెడ్డి

- తుఫాన్ ప్రభావంతో నష్ట పోయిన ప్రతి రైతును ఆదుకోవాలని టిడిపి మండల కన్వీనర్ తిప్పిరెడ్డి లక్ష్మిరెడ్డి కోరారు. మండలంలోని ఆధార్ గ్రామంలో దెబ్బతిన్న వరి, మినుము పంటలను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా లక్ష్మిరెడ్డి మాట్లాడుతూ.. వర్షాలకు పంటలు పూర్తిగా నీట మునిగిపోయాయన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం రైతులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి నేతలు పిచ్చి నాయుడు, రామానాయుడు, రామసుబ్బయ్య పాల్గొన్నారు.



బద్వేల్ రోడ్డులో అన్నదానం చేస్తున్న రాచమల్లు సేవాదళ్ సభ్యులు

పలు సేవా కార్యక్రమాలు

ప్రజాశక్తి - చాపాడు

వైసిపి రాష్ట్ర కార్యదర్శి, రాష్ట్ర సేవాదళ్ ప్రెసిడెంట్ రాచమల్లు రవిశంకర్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా మైదుకూరులో ఆయన అభిమానులు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. మార్కెట్ కూడలిలో రాచమల్లు రవిశంకర్‌రెడ్డి యూత్ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ఆదరణ సేవా సమితి ఆధ్వర్యంలో రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాచమల్లు సేవాదళ్ సభ్యులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE ADDITIONAL SENIOR CIVIL JUDGE: KADAPA.

E.P.No.28/2023

O.S.No . 352/2017

1. Marujolla Ramamohan Reddy S/o late Pakkira Reddy, [died].
2. Marujolla Eswaramma W/o late M. Rama mohan Reddy, aged about 58 years, Hindu, House wife,
3. Inakollu Shobha Wife of Inakollu Masthan Reddy and D/o late M. Ramamohan Reddy, aged about 36 years, Hindu, House wife,
4. Marujolla Tej Deep Reddy, S/o late M. Rama mohan Reddy, aged about 30 years, Hindu, Soft-wear Engineer,

All are residents of D.No.42-279-2, Bhagyanagar Colony, Kadapa city & District.

[1st petitioner Marujolla Ramamohan Reddy having died his L. Rs Wife and Children are added as per Court orders in E.A.No.1/2022 in E.P.130/ 2019' in Os.No.352 /2017 dt.21.02.2022]

...Petitioners/ D.Hrs.

And

Peddi Krishna Reddy S/o Narasimha Reddy, having died his L.Rs. wife and sons,

1. Peddi Venkataramanamma W/o late Peddi Krishna reddy,
2. Peddi Sekhar Reddy S/o late Peddi Krishna reddy,
3. Peddi Madhu Reddy S/o late Peddi Krishna Reddy,

All are Hindus, residents of Door No.3/324, Akkayapalle, Kadapa City & District.

...Respondents/J.Drs

WHEREAS the Petitioners have filed petition against you for recovery of the amount due under the decree by attachment and sale of E.P.schedule property, you are hereby summoned to appear in the Court in person or by Advocate duly instructed and able to answer all material questions relating to the petition or who shall be accompanied by some other person able to answer all such questions on the day of 21-12-2023, at 10.30 A.M. in the forenoon answer the claim and you are directed to produce on that day all the documents upon which you intend to rely in support of defense or failing which the matter will be decided exparte.

PROPERTY SCHEDULE

All that piece and parcel of property situated at Kadapa District, Kadapa registration District, Kadapa Urban Sub-District, Kadapa Municipal Corporation area, erstwhile Kadapa Kadapa Mandal, Akkayapalle Grama panchayath now within Kadapa Municipal Corporation area, Tilak Nagar, near to the house bearing D.No.3/325 situated vover an extent of Ac.0.03 1/2 cents Northernside out of Ac.0.04 cents out of Ac.2.96 cents in Circar Punji D.No.35/1.of Akkayapalle village fields, bounded by East: Road; West: Kaluva; North: land in S.No.35/2; and South: site of Durgam Sasidharan; within these boundaries admeasuring East-West: on Northern side- 67 ft or 20.42 mts; East-West : on Southern side- 65 ft or 19.81 mts; North-South-on Eastern side: 25 ft or 7.62 mts; and North-South-on Western side: 23 ft or 7.01 mts; in all Ac.0.03 1/2 cents or 176 sq.yards site in which the newly constructed building RCC building Ground Floor with an plinth area of area 1218 sq.fts & RCC building First Floor with an plinth area of 1218 sq .ft., with all electrical fittings, Doors, windows Water tap etc., with all easementary rights.

//By Order of The Court//

G.RAMALINGA REDDY

Advocate for Petitioner, KADAPA.

అంబేద్కర్ ఆశయాలను సాధిద్దాం



అంబేద్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

ప్రజాశక్తి - కడప

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయాలను సాధిద్దామని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు బండి జకరయ్య, నగర అధ్యక్షులు వై.విష్ణుప్రీతమ్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి చీకటి చార్లెస్ పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో బుధవారం ఆ పార్టీ నగర అధ్యక్షులు విష్ణుప్రీతమ్‌రెడ్డి ఆధ్వర్యంలో అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర సమాచార హక్కు చైర్మన్ కోటపాటి లక్ష్మయ్య, బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కొపూరి శ్రీనివాసులు, ఓబీసీ జిల్లా అధ్యక్షులు కుల్లయ్యప్ప, ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షులు మామిళ్ళ బాబు, సమాచార హక్కు చట్టం జిల్లా అధ్యక్షులు మామిళ్ళ నరసింహులు, యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు మధురెడ్డి, జిల్లా మహిళా నాయకురాలు పి.నాగరాణి, గౌరీ, జిల్లా మైనార్టీ వైస్ చైర్మన్ అబ్దుల్ రసూల్, చింతకొమ్మదిన్నె మండలం అధ్యక్షులు జయకృష్ణ, హరి ప్రసాద్, సూర్యుడు, ఫారుక్ పాల్గొన్నారు.

- కడప వైసిపి జిల్లా కార్యాలయంలో బుధవారం అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా ఆ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. అంబేద్కర్ చిత్రపటానికి ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాషా, ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి, వైసిపి రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్ పూలమాలవేశారు. కార్యక్రమంలో నగర అధ్యక్షులు సుబ్బారెడ్డి, నగర్ మహిళా అధ్యక్షురాలు టీపీ వెంకటసుబ్బమ్మ, కార్పొరేటర్లు, కో-ఆప్షన్ సభ్యులు, నాయకులు, మహిళా నాయకురాళ్లు పాల్గొన్నారు.

- బడుగు బలహీన వర్గాల ఆశ జ్యోతి, జ్ఞాన సూర్యుడు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు బత్తల లింగమూర్తి అన్నారు. అంబేద్కర్ వర్ధంతి పురస్కరించుకొని కొత్త కలెక్టరేట్‌లోని అంబేద్కర్ కాంస్య విగ్రహానికి బీసీ సంక్షేమ సంఘం నాయకులు పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గోవింద నాగరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి మూలకాని త్రివిక్రమ యాదవ్, జిల్లా యూత్ ప్రెసిడెంట్ సిఆర్ఐ సునీల్ జయంత్, నగర కమిటీ అధ్యక్షులు జే.నరసింహం, జిల్లా ఉపాధ్యక్షులు పస్తం అంజి, ఆర్ల గంగయ్య, ఓబయ్య, ఆర్ మునిరత్నం గౌడ్, కార్యాలయం కార్యదర్శి ఎన్ వెంకటేశ్వర్లు, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ పాల్గొన్నారు. **కడప అర్బన్ :** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి టిడిపి కడప నియోజకవర్గ మాజీ ఇన్‌ఛార్జి విఎస్ అమీర్‌బాబు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో కడప తెలుగు యువత నగర అధ్యక్షులు మేకల వెంకటేష్ యాదవ్, రాష్ట్ర మైనార్టీ ప్రధాన కార్యదర్శి నాసర్ అలీ, 39వ డివిజన్ ఇన్‌ఛార్జి ఇలియాజ్ పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న లక్ష్మీరెడ్డి

- డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయాలను విద్యార్థులు, యువత కొనసాగించాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం జిల్లా కార్యదర్శి జి.శ్రీనాథ్ యాదవ్ పిలుపునిచ్చారు. పిడియస్‌యు ఆధ్వర్యంలో అంబేద్కర్ వర్ధంతి వేడుకలు నగరంలోని శ్రీ పద్మశ్రీ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పిడియస్‌యు నగర నాయకులు రిజ్వాన్, జగదీష్, మల్లికార్జున, గణేష్, చంద్ర, బాబు, హేమచంద్రారెడ్డి, అనిల్, దిలీప్, అక్బర్, హరి పాల్గొన్నారు.

- భారతరత్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు ఆలంఖాన్‌పల్లె లక్ష్మీరెడ్డి బుధవారం కడప కలెక్టర్ కార్యాలయంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వెంకటేష్, లోహియా నగర్ బాషా, అల్లంఖాన్‌పల్లె గంగిరెడ్డి పాల్గొన్నారు.

- భారత హక్కుల పిత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ అని బహుజన్ టీచర్స్ అసోసియేషన్ కడప జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ హరి కొండయ్య అన్నారు. బిటిఎ కార్యాలయంలో అంబేద్కర్ మహాపరినిర్వాణ దినం సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు.

- రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా సిపిఎం ఆధ్వర్యంలో ఘనంగా నివాళి అర్పించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సగిలి రాజేంద్ర ప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షులు ఎంఆర్ నాయక్, నాయకులు రఘు, ఉదయ్ పాల్గొన్నారు. **జమ్మలమడుగు :** అంబేద్కర్ 67వ వర్ధంతి సందర్భంగా సిఐటియు పట్టణ కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలతో ఘనంగా నివాళి అర్పించారు. కార్యక్రమంలో సిఐటియు పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు విజయ్, దాసు, సిఐటియు ఆటో వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు ఆదాము, మున్నా, కమల్‌బాషా, కృష్ణారెడ్డి, అంజి, రమేష్, శీను, దివాకర్, భీమ్లా, వెంకటేష్, రాజు పాల్గొన్నారు.

- ప్రపంచ మేధావి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్‌రెడ్డి పిలుపునిచ్చారు. అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా పాత బస్టాండ్‌లోని అంబేద్కర్ విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వేల్పుల శివమ్మ, వైస్ చైర్మన్ మంగదొడ్డి సింగరయ్య, మైలవరం మండలం ఇన్‌ఛార్జి దొడియం విష్ణువర్ధన్‌రెడ్డి, డైరెక్టర్ మార్బుల్ శీను, పట్టణ అధ్యక్షుడు పోరెడ్డి మహేశ్వర్‌రెడ్డి, బడిగింజల చంద్రమౌళి, కిరణ్, వైసిపి నాయకులు, దళిత సంఘం నాయకులు పాల్గొన్నారు. **జమ్మలమడుగు రూరల్ :** భారత దేశంలో ప్రస్తుత తరుణంలో రాజ్యాంగ పరిరక్షణనే ధ్యేయంగా పని చేద్దామని, అప్పుడే మహనీయుడు అంబేద్కర్‌కు మనమిచ్చే ఘనమైన నివాళి అని సిపిఎం జమ్మలమడుగు కార్యదర్శి వీరనాల శివనారాయణ, టిడిపి ఇన్‌ఛార్జి చదిపిరాళ్ళ భూపేష్ సుబ్బరామిరెడ్డి అన్నారు. స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్, పట్టణ కార్యదర్శి తులసీశ్వర్ యాదవ్, రాష్ట్ర కార్యదర్శి రమణారెడ్డి, సిపిఎం నాయకులు ప్రసాద్‌రెడ్డి, కృష్ణారెడ్డి, ఎస్‌సి సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి. జయచంద్ర, మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు బిర్రు నెల్సన్, ఫిలిప్, వెల్డింగ్ గైబు, పాలూరు సుధీర్ కుమార్‌రెడ్డి, జింకల బాషా, వెల్డింగ్ గైబు, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు. **చాపాడు :** బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి అంబేద్కర్ అని మాల మహానాడు మైదుకూరు నియోజకవర్గం అధ్యక్షుడు చిట్టిబాబు పేర్కొన్నారు. బుధవారం ప్రపంచ మేధావి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఐతా బాబు, లోకాయపల్లి శ్రీను, సుబ్బయ్య, బాలసుబ్బయ్య, చిన్న మాధవయ్య, కుమార్, పుల్లయ్య పాల్గొన్నారు. **బి.కోడూరు :** రాజ్యాంగ స్ఫూర్తిదాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ వర్ధంతి వేడుకలు మండలంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో జడ్‌పిటిసి దావీదు, వైసిపి నాయకులు, సిపిఎం నాయకులు ఓబులేసు, ప్రజలు పాల్గొని ఆయనకు ఘన నివాళులర్పించారు. **చెన్నూరు :** స్థానిక ఎంపిపి కార్యాయలంలో బుదవారం డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపిపి చీర్ల సురేష్ యాదవ్, ఎంపడిఒ డి.సుబ్రమణ్యం శర్మ, వైసిపి మండల కన్వీనర్ జి.ఎన్.భాస్కర్‌రెడ్డి మండల వ్యవసాయ సలహాదారుడు యర్రసాని మోహన్‌రెడ్డి, రఘునాధరెడ్డి, ఎంపిటిసి సభ్యులు, చంద్ర యాదవ్, సర్పంచ్ పిచ్చయ్య పాల్గొన్నారు. **ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) :** డాక్టర్ బిఆర్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా పాతబస్టాండ్ వద్ద నున్న ఆయన విగ్రహానికి రాష్ట్ర మాల మహానాడు (రామోజీవర్గం)వ్యవస్థాపక అధ్యక్షుడు రామోజీ ఇమ్మానియేల్, రాష్ట్ర గౌరవ అధ్యక్షులు ఎస్.మురళి ప్రసాద్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పూసల చిన్న ఓబన్న, జమ్మలమడుగు నియోజకవర్గ అధ్యక్షుడు సంగటి పుల్లయ్య పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎం సుధాకర్, ఇ సుబ్రహ్మణ్యం (అబ్బి), ఎం సత్యరాజు, సికె కుమార్, ఎ. ప్రణయ్‌కుమార్ పాల్గొన్నారు.

- అంటరానితనం, వివక్షలపై అలుపెరుగని పోరాటం చేసి అస్తిత్వ ఉద్యమాలకు దశ దిశలను చూపిన స్ఫూర్తి ప్రదాత, ఆర్థిక వేత్త, న్యాయ కోవిదుడు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అని జైభీమ్ రావ్ భారత్ పార్టీ స్టేట్ జాయింట్ సెక్రటరీ పల్లె రమేష్ పేర్కొన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా ఘన నివాళి అర్పించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పల్లె సురేష్, కె.ఓబులేసు, కత్తి ఓబులేసు, నరసింహులు, తీట్ల ప్రవీణ్, రమేష్, పుల్లయ్య, శ్రీనివాసులు, కుల్లాయప్ప, ఎరికలయ్య,సుబ్బారాయుడు, మేరేసు బాబు పాల్గొన్నారు. **ఎర్రగుంట్ల :** ఎర్రగుంట్ల పట్టణంలోని అంబేద్కర్ నగర్ సమీపంలోని వై జంక్షన్ వద్ద బిఆర్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా అఖిలపక్ష రాజకీయ పార్టీలు, దళిత సంఘాలు, బీసీ సంఘాలు, ప్రజా సంఘాలు, పట్టణ అభివృద్ధి సంఘం నాయకులు అంబేద్కర్ చిత్రపటాన్ని సర్కిల్లో ఏర్పాటు చేసి పూలమాలతో ఘననివాళి అర్పించారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు సుబ్బారెడ్డి, సిపిఎం నాయకులు బయన్న, పట్టణ అభివృద్ధి సంఘం కన్వీనర్ వి.అన్వేష్, పలుపార్టీ నాయకులు పాల్గొన్నారు. **పులివెందుల రూరల్ :** దేశంలోని బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, రాజ్యాంగ సృష్టికర్త డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అని మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మార్కెట్ యార్డ్ చైర్మన్ చిన్నప్ప, రాష్ట్ర సివిల్ సప్లయ్ డైరెక్టర్ గంగాధర్‌రెడ్డి తెలిపారు. అంబేద్కర్ వర్ధంతిని పురస్కరించుకొని స్థానిక పాత ఆర్‌టిసి బస్టాండ్ సమీపంలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కోళ్ల భాస్కర్, ఆప్షన్ నెంబర్ దాసరి చంద్రమౌళి, కౌన్సిలర్ పురుషోత్తం, డేనియల్ బాబు, సూరి, చంద్రమౌళి, రంగనాయక స్వామి దేవస్థానం చైర్మన్ సుధీకర్‌రెడ్డి, ఫైర్ రామకృష్ణ, రాజాకులయప్ప, వైసిపి నాయకులు, కార్యకర్తలు, ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు. **వేంపల్లె :** బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయాల కోసం కృషి చేయాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చెరసాల యోగాంజనేయులు, ఆమ్‌ఆద్మీ పార్టీ జిల్లా కో-ఆర్డినేటర్ రహంతుల్లా పేర్కొన్నారు. అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా వారు వేర్వేరుగా నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో వైస్ ప్రిన్సిపల్ నాగేంద్ర, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఓబుల్‌రెడ్డి, గంగాధర్, అంబేద్కర్ సేవా సమితి అధ్యక్షుడు బందెల రామాంజనేయులు, ఆమ్‌ఆద్మీ పార్టీ జిల్లా కో-కన్వీనర్ దాదాపీర్, అంబేద్కర్ సేవా ఉపాధ్యక్షుడు పుల్లయ్య, ఆప్ నాయకులు సిరాజ్, హిమాయత్, అహమ్మద్ పాల్గొన్నారు. **ప్రొద్దుటూరు :** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జీవితం సమాజానికి అనుసరణీయమని కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి నజీర్ అన్నారు. అంబేద్కర్ వర్ధంతిని పురస్కరించుకొని మైదుకూరు రోడ్డులోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. అనంతరం నజీర్ కాంగ్రెస్ పార్టీ నూతన మండల కమిటీని ప్రకటించారు. పట్టణ అధ్యక్షునిగా న్యాయవాది జిలానిబాషా, మండల అధ్యక్షుడుగా రామాంజనేయులు, రాజుపాలెం మండల అధ్యక్షునిగా పఠాన్ రషీద్ ఖాన్‌ను నియమించారు. **పోరుమామిళ్ల :** అంబేద్కర్ బలహీన వర్గాల కోసం రాజ్యాంగంలో విద్యతోపాటు వారికి సరైన హక్కులను కల్పించడంలో విజయం సాధించారని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ చిత్తా విజయప్రతాప్ రెడ్డి, రంగసముద్రం సర్పంచ్ చిత్త రవిప్రకాష్‌రెడ్డి, సిపిఎం మండల కార్యదర్శి బైరవ ప్రసాద్ పేర్కొన్నారు. అంబేద్కర్ సర్కిల్‌లో ఆయన విగ్రహానికి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో జెడ్పిటిసి ముత్యాల ప్రసాద్, వైస్ ఎంపీపీ సి.బాషా, అఖిల భారత మానవ హక్కుల సంఘం చీఫ్ గంగన్న, అంబేద్కర్ ఆశయ సాధన కమిటీ అధ్యక్షులు ముత్యాల ప్రసాద్ రావు, దళిత , ఉపాధ్యాయ, కార్మిక, ప్రజాసంఘా నాయకులు పాల్గొన్నారు.



ప్రొద్దుటూరులో మాట్లాడుతున్న రామోజీ ఇమ్మానియేల్

పేదల వైద్యానికే సిఎం ప్రాధాన్యత

ప్రజాశక్తి - జమ్మలమడుగు

గ్రామాలలో ఉండే ప్రజలకు, పరిపాలన సౌలభ్యం, మెరుగైన వైద్యసేవలను అందించాలనే మహోన్నత ఆశయంతో ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి గ్రామ సచివాలయాలు, వైయస్సార్ విలేజ్ హెల్త్ కినిక్‌లను ఏర్పాటు చేస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని మోరగుడి గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం, వైయస్సార్ విలేజ్ క్లినిక్‌ను బుధవారం ఎమ్మెల్యే, ఎంపిపి హరిత ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్య మంత్రి పేదల ఆరోగ్యానికి ప్రాధాన్యతనిస్తున్నారని వివరించారు. పేద, మధ్యతరగతి ప్రజలు వైద్యం కోసం దూర ప్రాంతాలకు వెళ్లనవసరం లేకుండా తమ గ్రామాల్లో వైద్య సేవలను పొందేందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వం వైద్య ఆరోగ్యశాఖను నిర్లక్ష్యం చేసిందన్నారు. ఈ ఆరోగ్య కేంద్రంలో బిపి, షుగర్, మలేరియా మొదలగు జబ్బులకు రక్త పరీక్షలను ఉచితంగా అందిస్తారని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జడ్పిటిసి అశ్విని, ఎంపీటీసీ బాబు, సీనియర్ నాయకులు సుధాకర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, బీసీ నాయకులు ఆంజనేయులు, సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



వైఎస్ఆర్ విలేజ్ హెల్త్ క్లినిక్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



మాట్లాడుతున్న సిపిఎం నాయకులు సత్యనారాయణ

లారీల సమ్మెను విరమింపజేయాలి : సిపిఎం

ప్రజాశక్తి -ప్రొద్దుటూరు

వారం రోజులుగా ఇండియన్ గ్యాస్‌కు చెందిన లారీలు సమ్మెలో ఉండడంతో ప్రజలు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆ సమ్మెను విరమింపజేయాలని సిపిఎం కార్యదర్శి సత్యనారాయణ కోరారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 1నుండి సమ్మె చేస్తున్నారన్నారు. తుఫాను కారణంగా వర్షాలు విపరీతంగా కురుస్తున్నాయని, ఇళ్లలో గ్యాస్ అయిపోతే వంట చెరుకు కూడా లభించని పరిస్థితి నెలకొంటుందని తెలిపారు. ఫలితంగా పస్తులుండాల్సి వస్తుందన్నారు. ఇండియన్ గ్యాస్ వినియోగదారుల సమస్యను దృష్టిలో ఉంచుకొని ఇండియన్ గ్యాస్ ప్లాంటుకు చెందిన అధికారులు లారీ యజమానులతో చర్చించాలన్నారు. ఆ దిశగా పౌరసరఫరాల అధికారులు కలెక్టర్ అగ్రిమెంట్లను పరిశీలించి చర్చలు జరిపి గ్యాస్ అందేలా చూడాలన్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే గ్యాస్ బాధితులను కలుపుకొని ఆందోళన కార్యక్రమాలు చేయాల్సి వస్తుందని సత్యనారాయణ హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు శేఖర్, లక్ష్మయ్య పాల్గొన్నారు.

బలిజ సంఘమా లేక వైసిపి అనుబంధ సంఘమా..?

ప్రజాశక్తి - వేంపల్లె

పులివెందులలో దేవర సిరిబండి వెళ్లే రహదారి విషయంపై బలిజ సంఘం నాయకులు వైసిపి అనుబంధం సంఘంగా మాట్లాడడం శోచనీయమని ఇడుపులపాయ టిడిపి యూనిట్ ఇన్‌ఛార్జి పోతిరెడ్డి శివ అన్నారు. బుధవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ సెంట్రల్ బోలె వార్డు వల్ల కలుగుతున్న ఇబ్బందులపై బలిజ నాయకులు మాట్లాడాలని కోరారు. పులివెందులలోని గరండాల వంక ఆక్రమణలకు గురికాలేదని మీరు కాదు సర్టిఫికెట్ ఇచ్చేదని పేర్కొన్నారు. పులివెందుల బలిజలకు టిడిపితో విడదీయరాని బంధం ఉందన్నారు. సంఘం అభివృద్ధికి పాటుపడాలని రాజకీయాలతో సంబంధం లేదన్నారు. ఇప్పటికైనా సిరిబంది పోయే రహదారి కోసం పాటుపడాలని ఆయన సూచించారు. విలేకరుల సమావేశంలో టిడిపి నాయకులు పిపి చెంద్రాయుడు, మాజీ గండి చైర్మన్ భాస్కర్ రాయల్, భాను కిరణ్ రాయల్, కొండాలపల్లె శ్రీను, చిన్న నర్సింహులు, బాలకృష్ణ పాల్గొన్నారు.

నేడు శ్రీవారి కల్యాణం, అన్నదానం

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పట్టణంలోని వెంకటరమణ స్వామి ఆలయంలో ఈనెల 2 నుంచి ప్రారంభమైన అష్ట బంధన కుంభాభిషేక కార్యక్రమంలో భాగంగా ఐదు రోజులపాటు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా గురువారం స్వామివారికి కల్యాణోత్సవం, అనంతరం దాదాపు పదివేల మందికి అన్నదానం చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఏలూరు తుమ్మలపల్లె గ్రామానికి చెందిన బివిఎస్ఆర్ లారీ ట్రాన్స్‌పోర్ట్, భారతి సిమెంట్ కాంట్రాక్టర్ బివి సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో ఆలయ నిర్వహిస్తున్నారు. నియోజకవర్గంలోని చుట్టుపక్కల గ్రామాల పరిధిలోని ప్రజలందరూ అన్నదాన కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని సుబ్బారెడ్డి కోరారు.

రేవంత్‌రెడ్డి సిఎం కావడం హర్షణీయం

- ఆర్‌సిడిఎస్ జాతీయ కార్యదర్శి ఒంటెద్దు రామలింగారెడ్డి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్



కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రెడ్డి సామాజిక వర్గాలనే ముఖ్యమంత్రులుగా నియమించడం జరిగిందన్నారు. ప్రస్తుతం తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ గెలుపొందడంతో అదే ఆనవాయితీగా రెడ్డి సామాజిక వర్గానికి చెందిన రేవంత్‌రెడ్డిని నియమించడం హర్షణీయమని రెడ్డి కమ్యూనిటీ డెవలప్మెంట్ సొసైటీ జాతీయ కార్యదర్శి ఒంటెద్దు రామలింగారెడ్డి తెలిపారు. ఆ మేరకు బుధవారం ఆయన మాట్లాడుతూ రెడ్డి సామాజిక వర్గం అధికారంలో ఉంటే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆర్‌సిడిఎస్ జనరల్ సెక్రటరీ ఎర్రపురెడ్డి రవిప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు.

జిల్లా సైన్స్ ఫెయిర్ ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న విద్యాశాఖాధికారులు

చాపాడు : స్థానిక డిల్లీ పబ్లిక్ స్కూల్ ఆవరణలో ప్రొద్దుటూరు ఉప విద్యాశాఖ అధికారి రాజగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా సైన్స్ ఫెయిర్-2023 కమిటీల కన్వీనర్లు బుధవారం ఏర్పాట్లను పర్యవేక్షించారు. స్టాల్స్ ఏర్పాటు, 36 మండలాల నుంచి విద్యార్థులు, ఉపాధ్యాయులు తెచ్చే ప్రాజెక్టులను ఎక్కడెక్కడ ఏర్పాటు చేయాలో.. ఏ విధమైన ఏర్పాటు చేయాలి అని ఐడిపిఎస్ కరస్పాండెంట్ జయచంద్రారెడ్డిని కలిసి సమీక్షించారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి మహేశ్వర్‌రెడ్డి, రాజుపాలెం, మైలవరం, చాపాడు మండల విద్యాశాఖ అధికారులు జిజె క్రిష్టఫర్, బత్తిని చిట్టిబాబు, రవిశంకర్, వంశీకృష్ణ పాల్గొన్నారు.

కులగణన పక్కాగా చేపట్టాలి

ప్రజాశక్తి - చాపాడు

కులగణన పక్కాగా చేపట్టాలని మైదుకూరు మున్సిపల్ చైర్మన్ మాచనూరు చంద్ర పేర్కొన్నారు. మున్సిపల్ కార్యాలయంలో బుధవారం జరిగిన రాష్ట్ర కులగణన సదస్సులో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం కులగణన కార్యక్రమాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందన్నారు. సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి కులగణనను నిర్వహించాలన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రంగస్వామి, డిప్యూటీ తహశీల్దార్ మల్లికార్జున్, ఎంపీడీఓ రమణారెడ్డి, కౌన్సిలర్లు, సిబ్బంది పాల్గొన్నారు. **పులివెందుల టౌన్ :**రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కులగణన సర్వేపై వెంకటాపురం సచివాలయంలో మున్సిపల్ కో ఆప్షన్ మెంబర్ దాసరి చంద్రమౌళి సచివాలయం సిబ్బంది, వాలంటీర్లతో బుధవారం అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయం సిబ్బందితో కలిసి ప్రతి వాలంటీరు వారి పరిధిలోని ప్రతి ఇంటికి వెళ్ళి కులగణన సర్వే చేయాలన్నారు. ఎలాంటి తప్పులు దొర్లకుండా చూడాలని సూచించారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

ప్రజాశక్తి - చక్రాయపేట



దాతను సన్మానిస్తున్న ఎసి ముకుందారెడ్డి

జిల్లాలో ప్రసిద్ధి చెందిన గండి వీరాంజనేయ స్వామి శాశ్వత నిత్యాన్నదాన పథకానికి చిత్తూరు జిల్లా చౌడేపల్లి మండలం లద్దిగం వాసవ్యులు అక్కులరెడ్డిగారి వినీల్ కుమార్‌రెడ్డి వీరి తల్లిదండ్రులు నీరజమ్మ, శంకరరెడ్డి రూ. 1,00,116 విరాళం అందజేశారు. దాతలకు ప్రత్యేక దర్శనం చేయించి తీర్థ, ప్రసాదాలు, స్వామివారి చిత్రపటం, శేష వస్త్రంతో వేద ఆశీ ర్వచనం చేసినట్లు ఎసి అలవలపాటి ముకుందరెడ్డి తెలిపారు.

టిడిపి ఇన్‌ఛార్జి ప్రవీణ్‌కు రెండు ఓట్లు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ప్రొద్దుటూరు టిడిపి ఇన్‌ఛార్జి జివి ప్రవీణ్‌కుమార్‌రెడ్డికి, ఆయన కుటుంబ సభ్యులు, ప్రధాన అనుచరులకు ప్రొద్దుటూరు, కమలాపురం నియోజకవర్గాల్లో ఓటు ఉందని మున్సిపల్ వైస్ చైర్మన్ బంగారు మునిరెడ్డి, కౌన్సిలర్ భూమిరెడ్డి వంశీధర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆ మేరకు వారు బుధవారం తహశీల్దార్ నజీర్ అహ్మద్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వంశీధర్‌రెడ్డి మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వ హయాంలో ఓటర్ల జాబితాలో దొంగ ఓట్లు పొందుపరిచారని రాష్ట్రవ్యాప్తంగా టిడిపి శ్రేణులు రచ్చ చేస్తూ, జాబితాలో మార్పుచేర్పుల కోసం సంబంధిత కార్యాలయాలలో ఫామ్-6, ఫామ్-7 దాఖలు చేస్తున్నారన్నారు. ప్రజాసంక్షేమ పథకాల లబ్ధిని ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ఆయన కుటుంబ సభ్యులు ఆస్వాదిస్తూ, మళ్లీ వైసిపి ప్రభుత్వంపై బురదజల్లడం హేయమైన చర్యగా అభివర్ణించారు. ఏదోక నియోజకవర్గంలో ప్రవీణ్ అభ్యర్థించిన చోట ఓట్లను తొలగించవలసిందిగా వారు కోరారు. కార్యక్రమంలో పలువురు వైసిపి నాయకులు పాల్గొన్నారు.



తహశీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న కౌన్సిలర్ వంశీధర్‌రెడ్డి